క్లుప్తంగా

లెదర్ ఇండస్ట్రీ డెవలెప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా కంచర్ల


కంచర్ల సుధాకర్ (ఫైల్)

నాగులుప్పలపాడు: లెదర్ ఇండస్ట్రీ డెవలెప్‌మెంట్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్‌గా కంచర్ల సుధాకర్ నియమితులయ్యారు. మండలంలోని అమ్మనబ్రోలు గ్రామానికి చెందిన కంచర్ల సుధాకర్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ ఎదుగుదల కోసం కృషి చేశారు. గతంలో జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా కూడా పనిచేశారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం

ఒంగోలు అర్బన్: పామూరుకు చెందిన అయేషా ఇంటర్‌లో 986 మార్కులు సాధించి పేదరికంతో ఎంసెట్ కోచింగ్ వెళ్లలేని పరిస్థితిని తెలుసుకున్న సూర్యశ్రీ దివ్యాంగుల ట్రస్ట్ విద్యార్థిని కోచింగ్ కోసం రూ.15 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ప్రవాస భారతీయుడు రమేష్ వెలగపూడి సహకారంతో పామూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె. శ్రీనివాస్ చేతుల మీదుగా వఅందించారు. ట్రస్ట్ చైర్మన్ సయ్యద్ షహనాజ్, ఎస్.కె సర్దార్, రాంబాబు, రసూల్ పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

కొమరోలు: గిద్దలూరు శాసనసభ్యుడు అన్నా వెంకట రాంబాబు బుధవారం మండలంలోని నాగిరెడ్డిపల్లెలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పర్యటిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ నాయకుడు వెంకటేశ్వర్లు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి ఇంటింటికీ తిరిగి సమస్యలు తెలుసుకుంటారని, ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

జగనన్నకు చెబుదాంపై సమీక్ష

కొనకనమిట్ల: సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలకు సంబంధించి ప్రజా సమస్యలకు మెరుగైన పరిష్కారం చూపేందుకు చేపట్టిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. సమీక్ష సమావేశంలో పాల్గొన్న స్పెషల్ అధికారి మాధురి మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలని మండల అధికారులకు సూచించారు. సమస్యల పరిష్కారానికి 1902కి కాల్ చేయాలన్నారు. సమస్యలపై ఫిర్యాదు చేసిన తరువాత యువర్ సర్వీస్ ఐడీ ఇస్తారని అన్నారు. ఐడీ ఆధారంగా సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్, జడ్పీటీసీ అక్కి దాసరి ఏడుకొండలు, ఎంపీడీఓ జనార్థన్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

సురక్షిత ప్రసవాలతోనే ఆరోగ్యం

గిద్దలూరు రూరల్: సురక్షిత ప్రసవాలతోనే ఆరోగ్యం ఉంటుందని ఎంపీపీ కడప లక్ష్మి అన్నారు. మండలంలోని కె.ఎస్.పల్లె పీహెచ్‌సీలో మంగళవారం నిర్వహించిన అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగంలో అనేక రకాల మార్పులు తీసుకొచ్చిందన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఫ్యామిలీ డాక్టర్, విలేజి, అర్బన్ హెల్త్ క్లీనిక్, ఆరోగ్యశ్రీ, 104, 108 వంటి అత్యవసర సేవలను అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా డాక్టర్ సుమయా ఆధ్వర్యంలో 65 మందికి వైద్య సేవలు అందించడమే కాకుండా మందులు అందజేశారు. జెడ్పీటీసీ బుడతా మధుసూదన్‌రావు, డాక్టర్ నాయబ్ రసూల్, మాజీ ఎంపీపీ కడప వంశీధరరెడ్డి, యూడీసీ నరేష్, ఎంపీహెచ్‌ఎస్ మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

'విజిలెన్స్' కోసం దరఖాస్తు చేసుకోవాలి

మార్కాపురం టౌన్: డివిజినల్ విజిలెన్స్, మానిటరీ కమిటీలో సభ్యులుగా కొనసాగేందుకు అర్హత కలిగిన వారు ఈ నెల 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సహాయ సాంఘిక సంక్షేమ శాఖ అధికారిణి అరుణ కుమారి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మాన్యువల్ స్కావెంజర్లుగా ఉపాధిని నిషేధించేందుకు డివిజన్ స్థాయిలో ఏర్పాటు కాబోతున్న కమిటీలు ఇద్దరూ సభ్యులు కొనసాగేందుకు అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మాన్యువల్ స్కావెంజర్, వృత్తి నిషేధం, పునరావాసం కోసం కృషి చేసిన స్వచ్ఛంద సంస్థకు చెందిన వారై ఉండాలన్నారు. వీరిలో ఒక పురుషుడు ఒక మహిళ సభ్యులుగా ఉంటారని తెలిపారు. అర్హత కలిగిన వారు పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 15వ తేదీలోపు మార్కాపురంలోని సహాయ సాంఘిక శాఖ కార్యాలయంలో అందజేయాలన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

తర్లుపాడు: మండలంలోని పత్తేపురం గ్రామానికి చెందిన తిరుమల వెంకటయ్య (32) కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మరణించారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ రామాంజనేయరెడ్డి, వైస్ ఎంపీపీ కే సుజాత, స్థానిక సర్పంచ్ తిరుమల బాలసుబ్బమ్మ, వైస్ సర్పంచ్ సీహెచ్ వెంకటేశ్వర్లు మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. వైఎస్ఆర్ బీమా తక్షణ సహాయం కింద రూ.10 వేలు అందజేసి మృతుని కుటుంబాన్ని ఓదార్చారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజేష్‌కుమార్, సచివాలయ సిబ్బంది శ్రీకాంత్, నాయకులు పెద్ద యోగయ్య, పెద్ద కోటయ్య, కాశిరెడ్డి, మేకల వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

- ప్రతి పని పెండింగ్ లేకుండా చేయాలి
- కొత్తపట్నం పంచాయతీలో అభివృద్ధి పనులు శూన్యం
- ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి


అభివృద్ధి పనులపై చర్చిస్తున్న ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి

కొత్తపట్నం: మండలంలో అన్ని పంచాయతీల్లో ఉన్న అభివృద్ధి పనులను త్వరిగతిన పూర్తి చేయాలని ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బందితో పెండింగ్ పనులపై ముఖా ముఖి కార్యక్రమం నిర్వహించారు. మండల పరిషత్ సాధారణ నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధులు, జిల్లా పరిషత్ నిధులు, గ్రామ పంచాయతీల్లో మంజూరు చేసిన అన్ని పనులపై పంచాయతీల వారీగా చర్చించారు. శ్మశానాలకు ప్రహరీలు, గ్రామాల్లో సీసీ, గ్రావెల్ రోడ్లు, అసంపూర్తిగా ఉన్న సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, ఎన్ఆర్‌జీఎస్ సంబంధించిన పనులు పూర్తి చేయాలని కోరారు. ఏమైనా అభ్యంతరాలు, తాము చేయలేమని చెబితే ప్రత్యమ్నాయ మార్గం చూసుకుంటామన్నారు. నిధులు వెనుకకు పోకుండా పనులు పూర్తి చేయాలని కోరారు.

కొత్తపట్నం పంచాయతీలో పనులు జరగటం లేదు

మండలంలో కొత్తపట్నం పెద్ద పంచాయతీ, అటువంటిది ఏ పని చెప్పినా చేయటం లేదని, చేయకపోతే తాము చేయలేమని చెప్పాలని, మీరు చేయక, టెండర్లతో చేయించుకోక నిధులు ఎట్లా ఉంటాయని పంచాయతీ కార్యదర్శి సునీతపై ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ సంబంధించిన స్తంభాలు, వైరు కొత్తవి మార్చుతుంటే మీరు వేయించలేకపోయారని, మండలంలో 14 పంచాయతీల్లో విద్యుత్‌కు సంబంధించిన 17 కోట్ల వర్కు జరిగితే ఒక్క కొత్తపట్నంలోనే ఎందుకు పనులు చేయించలేదని మండిపడ్డారు. ఇది మంచి పద్ధతి కాదని ఇప్పటికైనా తెలుసుకుని పనులు చేయటం మొదలు పెట్టాలని ఆదేశించారు. నిధులు ఉండి కూడా పనులు చేయకపోతే మీరేమి చేస్తున్నట్లో తమకు అర్థం కావటం లేదని అసహం వ్యక్తం చేశారు. ఇటువంటి పనులు చాలా పెండింగ్‌లో ఉన్నాయని పూర్తి చేయటానికి సహకరించాలని కోరారు. ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత, పీఆర్ ఏఈ శేషగిరిరావు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఒకటో తేదీకే పింఛన్లు


సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

–పేర్నమిట్ట గడప గడపలో ఎమ్మెల్యే టీజేఆర్

చీమకుర్తి: గతంలో ఏ ప్రభుత్వంలో లేని విధంగా ఒకటో తేదీ తెల్లారే సరికి అవ్వాతాతల ఇంటి తలుపులు తట్టి వలంటీర్లు పింఛన్లను ఇస్తున్నారని ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు అన్నారు. మంగళవారం పేర్నమిట్ట 39వ డివిజన్‌లో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు పాల్గొన్నారు. సంక్షేమ పథకాలను పొందిన లబ్ధిదారులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని లబ్ధిదారులు ఆదరిస్తున్నారని తెలిపారు. ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబునాయుడు, ఆయన కొడుకు లోకేష్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను సైకో అంటూ చులకనగా మాట్లాడటం పద్ధతి కాదన్నారు. వారిని తిట్టాలంటే తమకు కూడా పెద్ద పనేమీ కాదని, అంతకంటే ఎక్కువగానే తిడతామని ఆగ్రహం వ్యక్తం చేశారు. తొలుత 39వ డివిజన్‌లోకి స్థానిక పార్టీ నాయకులు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబుకు భారీగా స్వాగతం పలికారు. హారతులు పడుతూ తిలకం దిద్ది సంక్షేమ పథకాలను పొందిన లబ్ధిదారులు ఎమ్మెల్యేను అక్కున చేర్చుకున్నారు. బుక్‌లెట్‌లను ఇంటింటికీ తిరిగి అందిస్తూ.. ముచ్చటించారు. స్థానిక కార్పొరేటర్ గోలి లక్ష్మీ కోటేశ్వరమ్మ, తిరుపతిరావు ఆధ్వర్యంలో ఒంగోలు కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, పార్టీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, ఎంపీపీ బి.విజయ, జెడ్పీటీసీ సభ్యురాలు దుంపా రమణమ్మ ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. వర్ధు శేషయ్య, కత్తినేని శ్రీనివాసరెడ్డి, పెద్దిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, కార్పొరేటర్ తేళ్ళ చంద్రశేఖరరెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సచివాలయాల సేవలు విస్తృత పరచండి


మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్ కుమార్

ఒంగోలు అర్బన్: గ్రామ వార్డు సచివాలయాల ద్వారా ప్రభుత్వ సేవలు విస్తృత పరచాలని కలెక్టర్ దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. అభివృద్ధి సంక్షేమ పథకాల అమలు తీరుపై ప్రకాశం భవనం నుంచి మండల స్థాయి అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ సచివాలయాల సిబ్బంది నిబద్ధతతో పనిచేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. సచివాలయ ఉద్యోగులు బయోమెట్రిక్ హాజరు నూరు శాతం ఉండాలన్నారు. ఆధార్ నవీకరణ ప్రక్రియ గడువు లోపు పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో స్వచ్ఛ సంకల్పం కార్యక్రమాన్ని ప్రతిరోజూ నిర్విరామంగా నిర్వహించాలన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై ప్రచారం నిర్వహించి ప్రజల సమ్యలు పరిష్కరించాలన్నారు. వేసవి నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి సమస్యలు రాకుండా అధికారులు పక్కాగా చర్యలు తీసుకోఆలన్నారు. శివారు గ్రామాలకు త్రాగునీటిపై ప్రత్యేక దృష్టితో పనిచేయాలన్నారు. దెబ్బతిన్న పైపు లైన్‌ల మరమ్మతులు వెంటనే చేయాలన్నారు. జల వనరులు లేని ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. నాడు నేడు అభివృద్ధి పనులు వేగవంతం చేయాలన్నారు. జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు నిర్దేశిత సమయంలో పూర్తి చేసేలా చిత్త శుద్ధితో పర్యవేక్షించి పూర్తి చేయాలన్నారు. హౌసింగ్ పీడీ పేరయ్య, సీపీఓ వెంకటేశ్వర్లు, సచివాలయాల కో ఆర్డినేటర్ ఉషారాణి పాల్గొన్నారు.

నాటక పాత్రలకు వన్నె తెచ్చిన నిమ్మగడ్డ


నిమ్మగడ్డ మీరయ్యను శాలువాతో సన్మానిస్తున్న శాంతారావు

కొత్తపట్నం: పౌరాణిక రంగంలో ఆణిముత్యం నిమ్మగడ్డ మీరయ్య అని ఆంధ్రరాష్ట పౌరాణిక కళాకారుల సమాఖ్య ప్రధాన కార్యదర్శి, ఎంపీటీసీ సభ్యుడు మిట్నసల శాంతారావు కొనియాడారు. పాదర్తి గ్రామంలో పోతూలూరి వీర బ్రహ్మం నాటక ఉత్సవంలో భాగంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతారావు మాట్లాడుతూ మీరయ్య పౌరాణిక రంగంలో ఆణిముత్యమన్నారు. పౌరాణిక రంగంలో ప్రతి పాత్రను పోషించి మెప్పించాడని గుర్తు చేశారు. ఏపాత్ర చేసినా ప్రజల్లో చిరస్థాయిగా నిలిచిపోయే వ్యక్తి నిమ్మగడ్డని చెప్పారు. పద్యాలు మొదలు పెట్టే దగ్గర నుంచి చివరి దాకా గుక్క తిప్పకుండా పాడి వినిపించి జనగం గుండెల్లో నిలిచిపోయాడని వివరించారు. పోతూలూరి వీర బ్రహ్మం నాటక అనంతరం నిమ్మగడ్డ మీరయ్య, సీనియర్ కళాకారుడు సూరిబాబులకు శాలువాతో సత్కరించారు. రత్తయ్య, బేతాళ శ్రీనివాసరావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మార్కండేశ్వర స్వామికి లక్ష మల్లెలార్చన


స్వామి వారికి లక్ష మల్లెపూలార్చన


అమ్మవారికి మల్లెపూలార్చన


విగ్రహ ప్రతిష్టకు హాజరైన జంకె వెంకటరెడ్డి


ప్రత్యేక అలంకరణలో అంకమ్మ తల్లి

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని జగదాంబసమేత మార్కండేశ్వర స్వామి దేవస్థానంలో వైశాఖమాస మూలా నక్షత్రాన్ని పురస్కరించుకొని ఆదిదంపతులైన శివపార్వతులకు లక్ష మల్లెల అర్చన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. స్వామి వారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సహస్రనామార్చన, అమ్మవారి శ్రీ చక్ర సహిత కుంకుమార్చన, లలితా సహస్రనామార్చన, దేవీఖడ్గమాల నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. అర్చకులు తేజశర్మ, సాయిశర్మ, రేవంత్ శర్మ, సుబ్బారావు శర్మలు పూజలు చేశారు. ఆలయ చైర్మన్ వాలిచర్ల కేశవరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

మార్కాపురం: మార్కాపురం పట్టణ శివారుల్లో ఎస్ఎస్ అగ్రికల్చర్, హార్టీకల్చర్, లా కాలేజీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ మంగళవారం వైభవంగా భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, లా కాలేజీ ఫౌండర్ నాదెళ్ళ సుబ్రహ్మణ్యం, కరస్పాండెంట్ నాదెళ్ల చంద్రమౌళి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి షంషేర్ అలీబేగ్, మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, వైఎస్ఆర్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పీఎల్‌పీ యాదవ్, సాయిబాబా, ఆలయ కమిటీ అధ్యక్షుడు జీ హరిహరరావు, నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్ పీవీ కృష్ణారావు, వైఎస్ఆర్ సీపీ నాయకులు పంబి వెంకటరెడ్డి, మందటి మహేశ్వరరెడ్డి, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు గుంటక వనజాక్షి చెన్నారెడ్డి, రిటైర్డ్ తహశీల్దార్ సుబ్బారావు, వివిధ కళాశాలల ప్రిన్సిపల్స్, లెక్చరర్స్ పాల్గొని పూజలు నిర్వహించారు.

12 నుంచి షిరిడీ సాయి ఆలయ చతుర్థ వార్షికోత్సవం

తర్లుపాడు: ఈ నెల 12 నుంచి తర్లుపాడులోని షిరిడీ సాయి మందిర చతుర్థ వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ యం నాగమల్లికార్జున్ తెలిపారు. ఇందులో భాగంగా నేడు, రేపు సాయి సచ్చరిత్ర పారాయణం, 12న అభిషేకం , అలంకరణ, చెన్నమల్లేశ్వర స్వామి (బొడిచెర్ల) వారిచే భజన, పూజా కార్యక్రమాలు, మధ్యాహ్నం హారతి, అనంతరం అన్నదానం, సాయంకాలం హారతి అనంతరం పల్లకి ఉత్సవం నిర్వహించనున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై బాబా వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ట్రస్ట్ బోర్డు, మహిళా కమిటీ సభ్యులు కోరారు.

భక్తిశ్రద్ధలతో సప్తాహ మహోత్సవాలు

కొనకనమిట్ల: మండల కేంద్రం కొనకనమిట్ల సమీపంలో వెలసిన రామదూత క్షేత్రంలో 11వ శ్రీరామనామ సప్తాహ మహోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. రామదూత క్షేత్ర నిర్వాహకులు, వేదపండితులు అకలంకం వెంకటరామకృష్ణాచార్యులు ఆధ్వర్యంలో ముందుగా హోమాలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రమాసహిత సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. ఉభయ దాతలుగా దివ్వెల పేరం, బొగ్గరపు, కొప్పరపు, చెక్కా, పాలువాది కుటుంబాలకు చెందిన దంపతులు వ్యవహరించారు. ఉత్సవాలను గ్రామ ప్రజలతో పాటు పరిసర గ్రామాల ప్రజలు తిలకించారు. ఉత్సవాల అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ నెల 14 వరకు సప్తాహ మహోత్సవాలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ నిర్వాహకులు వెంకటరామకృష్ణ, యక్కంటి తిరుపతిరెడ్డి తెలిపారు.

భక్తుల కొంగు బంగారం అంకమ్మ తల్లి

ముండ్లమూరు: ఈదర అంకమ్మతల్లి తిరునాళ్ల మంగళవారం వైభంగా జరిగింది. ఈదర అంకమ్మతల్లి కోరిన కోర్కెలు తీర్చడంతో భక్తుల కొంగు బంగారంగా పేరుంది. పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని పలు గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసం పని చేయాలి


వీక్షిస్తున్న మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు


కార్యక్రమాన్ని వీక్షిస్తున్న ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డితో అధికారులు పార్టీ నాయకులు

మద్దిపాడు: సమస్యలను క్షేత్ర స్థాయిలోనే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి అన్నారు. మంగళవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రారంభించే కార్యక్రమాన్ని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వీక్షించారు. ఆమె మాట్లాడుతూ అర్హులైన వారికి పథకాలు అందించడంలో సచివాలయ ఉద్యోగులు అంకిత భావంతో పని చేయలని కోరారు. సమస్య పరిష్కరించకపోతే లబ్ధిదారులు జగనన్నకు చెబుతాం కార్యక్రమంలో ఇచ్చిన టోల్ ఫ్రీనెంబర్ 1902కు కాల్ చేస్తారని సీఎం కార్యలయం నుంచి సంబంధిత సిబ్బందికి ఫోన్లు వస్తాయని తెలిపారు. క్షేత్ర స్థాయిలోనే సమస్యను పరిష్కరించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకరావాలని కోరారు. ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఈఓపీఆర్‌డీ సుబ్బారావు, మండల కన్వీనర్ మండవ అప్పారావు, సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు బెజవాడ రాము, గుడ్డపాతల రవి, పైనం ప్రభాకర్, పిచ్చిరాజు, అశోక్ రెడ్డి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ప్రతి సమస్యనూ పరిష్కరిస్తాం

కొత్తపట్నం: కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశాలు మేరకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని మండల స్థాయి అధికారులు, ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శిలు హాజరై లైవ్ టెలికాస్ట్‌ను వీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రతి సమస్యను పరిష్కరిస్తామన్నారు. పార్టీలకు అతీతంగా పరిష్కరించాలని, ప్రతి ఒక్క సమస్యను జబాబుదారీ తనంగా ఉంటుందన్నారు. వైఎస్సార్ ఐడీ ప్రకారం ఏ స్టేజీలో ఉందని అర్జీ దారుడు చూసుకునే విధంగా మెసేజ్ రూపంలో వెళుతుందని చెప్పారు.

అంతా ప్రజలకు సేవకులమని, అధికారం పెరిగే కొద్ది మన బాధ్యత పెరుగుతుందని సీఎం ఆదేశించారు. గ్రామ స్థాయి సచివాలయం సిబ్బంది, అంగన్‌వాడీ స్కూల్స్, నాడు–నేడు, హెల్త్ హౌసింగ్ కాలనీల పథకాలకు సంబంధించిన బాధ్యతయుతంగా ఉద్యోగ ధర్మం పాటించాలని చెప్పారు. మండల స్థాయి అధికారులంతా సమావేశమై సమస్యలు పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని వివరించారు. ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, ఏవో నరేంద్రదేవ్, మండల స్థాయి సిబ్బంది, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శిలు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యంపై విజిలెన్స్ తనిఖీలు

దర్శి: దర్శి రూరల్ సెక్షన్ పరిధిలో విద్యుత్ విజిలెన్స్ ఈఈ తోట శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. దర్శి ఈఈ ఎస్ఏ కరీం ఆధ్వర్యంలో సిబ్బంది 44 బృందాలుగా ఏర్పడి మండలంలోని అన్ని గ్రామాల్లో ఏకకాలంలో తనిఖీలు చేశారు. మీటర్లు లేకుండా విద్యుత్ చౌర్యానికి పాల్పడిన ఏడుగురికి రూ.14 వేలు, మీటరు ఉండి విద్యుత్ చౌర్యం చేస్తున్న ఆరుగురికి రూ.80 వేలు, అనుమతించిన లోడు కన్నా అదనపు లోడు వాడుతున్న 24 సర్వీసులను గుర్తించి రూ.1,13 లక్షల అపరాధ రుసుం విధించినట్లు ఆయన తెలిపారు. విజిలెన్స్ ఈఈ శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరమని, వినియోగదారులు విద్యుత్ చౌర్యం గురించి తనకు సమాచారం ఇవ్వవచ్చని, తన నంబర్ 83310 19980 కు ఎప్పుడైనా ఫోన్ చేయవచ్చని చెప్పారు.

డీఎస్పీ నాగరాజుకు ఘన వీడ్కోలు


డీఎస్పీ నాగరాజును సత్కరిస్తున్న అధికారులు

ఒంగోలు: ఒంగోలు సబ్‌డివిజన్ పోలీసు ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తూ మచిలీపట్నం దిశ పోలీసుస్టేషన్ డీఎస్పీగా బదిలీ అయిన యు.నాగరాజుకు పోలీసు అధికారులు, సిబ్బంది ఘన వీడ్కోలు పలికారు. స్థానిక సబ్‌డివిజనల్ పోలీసు అధికారి కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వివి.నారాయణస్వామిరెడ్డి తదితరులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ ఒంగోలు డీఎస్పీగా బాధ్యతలు నిర్వహించడం తనకు మంచి అనుభూతిని ఇచ్చిందన్నారు. తాను ఎస్సై, సీఐతోపాటు డీఎస్పీగా కూడా ఒంగోలులోనే పనిచేయడంతో తనకు ఒంగోలుతో అనుబంధం ఎక్కువగా ఉందంటూ పేరుపేరునా అధికారుల కృషిని పేర్కొంటూ అభినందించారు. ఎస్‌బీ డీఎస్పీ మరియదాసు , ఒంగోలు డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి మాట్లాడుతూ నాగరాజు కృషిని ప్రశంసించడంతోపాటు మరింత మంచి హోదాకు చేరుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. వన్‌టౌన్ సీఐ వెంకటేశ్వర్లు, తాలూకా సీఐ రాంబాబు, సింగరాయకొండ సీఐ రంగనాథ్, ఒంగోలు రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి, ఎస్సై బాబూరావు, డీఎస్పీ నాగరాజును సత్కరించారు.

లైంగికదాడి కేసులో యావజ్జీవ శిక్ష

చీరాల: బాలికపై లైంగికదాడి కేసులో వ్యక్తికి యావజ్జీవ కారాగార జైలు శిక్షను విధిస్తూ న్యాయమూర్తి మంగళవారం తీర్పును వెలువరించారు. వివరాల్లోకి వెళితే.. గతేడాది జనవరి 4న వేటపాలెంలోని మంకెనవారిపాలెంలో మూడో తరగతి చదువుతున్న బాలికను ఇంటి సమీపంలో ఉండే మంకెన జయరావు తన ఇంట్లోకి పిలిచి బాలికపై అత్యాచారం చేశాడు. బాలిక తనపై జరిగిన లైంగిక దాడిని గురించి చిన్నమ్మ ఆంధ్ర కిరణ్మయికి చెప్పింది. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయగా బాధితురాలిని వైద్యపరీక్షల నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి మెరుగైన చికిత్స నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. బాలిక చిన్నమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వేటపాలెం ఎస్సై జి.సురేష్ కేసు నమోదు చేశారు. అప్పటి చీరాల డీఎస్పీ పీ శ్రీకాంత్ దర్యాప్తు చేసి నిందుతుడిని అరెస్ట్ చేశారు. కేసును ఒంగోలు 2వ ఏడీజే, పోక్సో కోర్టులో విచారణకు రాగా జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ స్వీయ పర్యవేక్షణలో చీరాల రూరల్ సీఐ మల్లికార్జునరావు, వేటపాలెం ఎస్సై జి.సురేష్, కోర్టు కానిస్టేబుల్ ఎస్కే కరిముల్లాలు సాక్షులను కోర్టులో హాజరుపరిచారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కేవీ రామేశ్వరరెడ్డి కోర్టులో వాదించి నిందితుడిపై నేరాన్ని నిరూపించారు. ఒంగోలు 2వ ఏడీజే, పోక్సో కోర్టు న్యాయమూర్తి ఎంఏ సోమశేఖర్ మంగళవారం నిందితుడు మంకెన జయరావుకు యావజ్జీవ కారాగార జైలు శిక్ష, రూ.2 వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. అలానే బాధితురాలికి చదువు, ఇతర అవసరాల నిమిత్తం రూ.2 లక్షలు, ముద్దాయి చెల్లించే జరిమానా డబ్బు కూడా బాధితురాలికి ఇవ్వమని ఉత్తర్వులు జారీ చేశారు. కేసులో ముద్దాయికి జైలు శిక్ష పడేలా చర్యలు తీసుకున్న పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు.